

సిఐటియు రాష్ట్ర మహాసభ సదర్భంగా 14న సదస్సు

భీమవరం :సిఐటియు రాష్ట్ర 16వ మహాసభ సందర్భంగా 'రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి - అవకాశాలు - అవరోధాలు' అంశంపై ఈనెల 14న యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా కృష్ణ, గుంటూరు జిల్లాల శాసనమండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు పెరగడానికి తీసుకోవాల్సిన విషయాలను వివరిస్తారన్నారు. ఈ సదస్సుకు ప్రముఖ విద్యా వేత్తలు, మేధావులు హాజరవుతారని తెలిపారు. వక్తలుగా బిల్డర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గన్నాబత్తుల శ్రీనివాసరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షులు కనుమూరి సత్యనారాయణ రాజు, ఛాంబర్ కామర్స్ అధ్యక్షులు మానేపల్లి సూర్యనారాయణ, ప్యాడీ రైస్ మర్చంట్స్ అధ్యక్షులు చావ్వాకుల నరసింహారావు, ఐస్ ఫ్యాక్టరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకట శ్రీరామనారాయణ పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని విఆర్‌ఒల ధర్నా

ప్రజాశక్తి - ఆచంట


రాష్ట్ర వ్యాప్తంగా విఆర్‌ఒలు తీవ్ర ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, తక్షణం ప్రభుత్వం స్పందించి వారికి పని ఒత్తిడి తగ్గించాలని విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షులు మిరియాల శేషగిరి అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఒలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ నజీముల్లా సాకుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ రీ సర్వే పేరుతో విఆర్‌ఒలు ఆందోళన చెందుతూ గుండెపోటు, యాక్సిడెంట్లకు గురవుతున్నారని తెలిపారు. దీంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న రీసర్వే నేటి నుంచి ప్రారంభమవుతుందని, దీని నిమిత్తం వంద రోజుల్లో పని పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తమ ఒత్తిడి తేవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. రీ సర్వేకు సంబంధించి సుమారు లక్ష రూపాయల వరకూ ఒక్కో విఆర్‌ఒకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ ఖర్చంతా ప్రస్తుతానికి విఆర్‌ఒలే భరించాలని తహశీల్దార్లు చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. దీనికి సంబంధించి బిల్లు వస్తే ఇస్తామని తహశీల్దార్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఇటువంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు ఆచంట సీతారాం, కె.నాగేశ్వరరావు, డి.చలం, పి.సూర్యనారాయణ, యాకోబు, రాజబాబు, యు.నరసింహమూర్తి, యు.రత్నకుమారి, చిట్టూరి శ్రీను, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.




ఆచంటలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఒలు

కాళ్ల : పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఒలు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఒల సంఘం భీమవరం డివిజన్ అధ్యక్షులు కొండేటి డానియేల్ స్మిత్ కెనడీ మాట్లాడారు. ప్రని ఒత్తిడి కారణంగా చనిపోయిన గ్రామ రెవెన్యూ అధికారుల కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. వారి కుటుంబ సభ్యులకు వెంటనే రూ.25 లక్షల ఆర్థిక సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ ఆర్గనైజర్ నిమ్మల రామాంజనేయులు, విఆర్‌ఒల సంఘం మండల ప్రధాన కార్యదర్శి నిట్టల సీతారాం, విఆర్‌ఒలు ఏడుకొండలు, శివ, నాగరాజు, సుబ్రహ్మణ్యం, సుధాకర్ పాల్గొన్నారు.

ఉండి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం విఆర్‌ఒలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షులు ఎస్.చిన్నారావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో విఆర్‌ఒలపై పని ఒత్తిడి విపరీతంగా పెరిగిందన్నారు. రెండు సంవత్సరాల నుంచి సెలవులు లేకుండా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రణాళిక ప్రకారం ప్రతి గ్రామంలోనూ వంద రోజుల భూ సర్వే చేపట్టాలని ఉన్నతాధికారులు విఆర్‌ఒలపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఎం.రవీంద్రకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు పాల్గొన్నారు.



ఉండి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఒలు



కాళ్ల తహశీల్దార్ కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఒలు

సబ్‌ప్లాన్ కాల పరిమితిని పొడిగించాలి

సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ కాలపరిమితిని పొడిగించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత, గిరిజన ప్రజలకు జనాభా ప్రాతిపాదికన నిధులు కేటాయించేందుకు పదేళ్ల కాలపరిమితితో 2013లో తీసుకొచ్చిన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం గడువు 2023 మార్చితో ముగియనుందున్నారు. ఈ చట్టం కాలపరిమితిని పెంచేందుకు వీలుగా చట్టసవరణ చేయాలని కోరారు. దళిత, గిరిజనులకు జనాభా ప్రాతిపాదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించి, వారి సంక్షేమానికి ఖర్చు చేయాలని కోరుతూ ఉమ్మడి రాష్ట్రంలో పెద్దఎత్తున ఉద్యమించిన ఫలితంగా అప్పటి ప్రభుత్వం ఎస్‌సి-ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం-2013ను పదేళ్ల కాలపరిమితితో తీసుకొచ్చిందన్నారు. 2015 వరకూ ఈ చట్టం అమలుకు సంబంధించిన నియమ నిబంధనలు లేకపోవడంతో ఇబ్బందులొచ్చాయని తెలిపారు. 2015 తర్వాత ఈ చట్టానికి లోబడి జనాభా ప్రాతిపాదికన నిధులను కేటాయిస్తూ వచ్చారని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రణాళికా సంఘాన్నే రద్దు చేయడంతో దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులకు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి ఆగిపోయి అపారమైన నష్టం జరిగిందన్నారు. ప్రణాళికాసంఘాన్ని పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. 2017 నుండి నీతి అయోగ్ నిబంధనల మేరకు ఎస్‌సి కాంపోనెంట్ పేరుతో నిధులను కేటాయించడం మొదలుపెట్టారని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేంద్రం స్పాన్సర్ చేసే పథకాలకు నిధులిచ్చేవారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చే బడ్జెట్‌కు అనుగుణంగా తనవాటా నిధులను కేటాయిస్తే ఆ మేర దళితులకు, గిరిజనులకు పథకాలు అందేవని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు తమవాటా నిధులను పూర్తిస్థాయిలో అందించకపోవడంతో 2013 నుండి చాలా పథకాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు రక్షణ అవసరమని తెలిపారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ 2013 చట్టంలోని ఛాప్టర్ ఒకటో క్లాజులోని నాలుగో అంశాన్ని సవరించి కాలపరిమితిని పెంచేలా రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని కోరారు.

సిఐటియు రాష్ట్రమహాసభను జయప్రదం చేయాలని

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


వచ్చేనెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో భీమవరంలో జరగనున్న సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం కూరగాయల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఫైలు పైడియ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ పశ్చిమగోదావరి జిల్లాకేంద్రం భీమవరంలో జరుగుతుం దన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో రెండో బార్డోలీగా పేరొందిన భీమవరం పట్టణంలో మొట్ట మొదటిసారిగా ఈ రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నామని తెలిపారు. 1970లో సిఐటియు ఏర్పడినప్పటి నుండి ఉద్యోగుల, కార్మికుల ప్రయోజనాలతో పాటు దేశప్రజల ప్రయోజనాలకోసం పని చేస్తుందని తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజలకు, ఉద్యోగులకు నష్టం చేసే ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని వారు తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలైన బ్యాంకు, బీమా, టెలికాం, రైల్వే, విద్యుత్, పోస్టల్, ఆర్‌టిసి, బొగ్గు, స్టీల్, రక్షణ వ్యవస్థలను నిర్వీర్యం చేసి బహుళజాతి సంస్థలకు లబ్ధిచేకూర్చే మోదీ ప్రభుత్వ విధానాలపై పెద్దఎత్తున సిఐటియు ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి రైస్ మిల్, స్పిన్నింగ్, పేపర్, ఆయిల్, సుగర్, జ్యూట్ వంటి చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని వారు వాపోయారు. దేశీయ, చిన్నతరహా పరిశ్రమలకు రక్షణ, ప్రోత్సాహకాలు కల్పించాలని సిఐటియు కోరుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వెంకటరావు, ఎల్.శ్రీను, ఎం.సత్యనారాయణ, ఎం.గణపతి, జి.సతీష్ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాటం

తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి- పాలకోడేరు

రైతులు ఆరు కాలు శ్రమించి పండించిన ధాన్యంపై ప్రభుత్వ పెత్తనం ఏమిటని, రైతులు పడుతున్న సమస్యలపై కలిసి పోరాడుదామని రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలం పరిధిలోని కొండేపుడిలో రైతులు పడుతున్న ఇబ్బందులను శ్రీనివాస్‌రెడ్డితో పాటు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, పాలకొల్లు, ఉండి ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు రమేష్, గంగాధర్ అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ఐదు ఎకరాల్లో కౌలుకు సాగు చేస్తున్నామని ధాన్యాన్ని గట్టుకు చేర్చి 20 రోజులు గడుస్తుందని ఇప్పటివరకు రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకూ అదనపు ఖర్చయిందన్నారు. ధాన్యానికి తేమ శాతంతో సంబంధం లేకుండా ఆ ఇంటికి రూ.20 చొప్పున తగ్గించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భూ యజమాని టి.నిర్మల మాట్లాడుతూ ఎనిమిది ఎకరాల సొంత వరిపొలం ఉందని నాలుగు ఎకరాలు చొప్పున కౌలుకు ఇచ్చామని అయితే రైతులు ధాన్యాన్ని గట్టుకు చేర్చి రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయలేదన్నారు. రైతులు కష్టాలు పడుతున్నారని చెప్పారు. వచ్చే ఏడాది కౌలుకు తీసుకోబోమని చెబుతున్నారని పేర్కొన్నారు. ధాన్యం తీసుకుని రైతు భరోసా కేంద్రాలకు వెళ్తుంటే అనేకసార్లు రైతులు తిరగాల్సిన పరిస్థితి ఉందన్నారు. రైతుల సమస్యలు చంద్రబాబు దష్టికి తీసుకెళ్తామని చెప్పారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రానికి వెన్నెముకగా ఉన్న రైతుల నడ్డి విరిచిందని విమర్శించారు. అవగాహన లేని వాలంటీర్లను, అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను నియమించి వారి చేత ధాన్యాన్ని కొనుగోలు చేయడం దారుణమన్నారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు మాట్లాడుతూ ధాన్యం తేమశాతం ఆర్‌బికెలో ఒకలా.. మిల్లు వద్ద మరోలా వస్తుందని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలో ఆక్వా రంగాన్ని శాశనం చేశారని విమర్శించారు. రైతులకు ఎలాంటి సాయమూ అందట్లేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపతి రాజు తిమ్మరాజు, రామ్‌ప్రసాద్ చౌదరి, టిడిపి మండల అధ్యక్షులు దెందుకూరు ఠాగూర్ కోటేశ్వరరావు, నాయకులు సూర్యనారాయణ, పద్మనాభం, రాము, వెంకటేశ్వరరావు, పెద్దిరాజు, నాగరాజు, అప్పారావు, వేంద్ర రాము, మోషేను, దొంగ కృష్ణ పాల్గొన్నారు.



ధాన్యం రాసులను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుకు చర్యలు

ప్రజాశక్తి - భీమవరం

మాండూస్ తుపాను వల్ల రాష్ట్రంలో జరిగిన నష్టంపై సిఎం జగన్ ఆయా జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుండి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుపాన్ ప్రభావిత జిల్లాల్లోనీ ప్రజలకు మెరుగైన సహాయాన్ని అందించాలని జగన్ ఆదేశించారు. తుపాను ప్రభావం ఉన్న జిల్లాల్లో రంగు మారిన, తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలను చేపట్టాలన్నారు. తుపాను కారణంగా ఇళ్లల్లోకి నీరు చేరిన గృహాలను ఎన్యుమరేట్ చేసి వారికి రేషన్ అందించడంతోపాటు, ప్రతీ కుటుంబానికి రూ.రెండు వేలు నగదును అందజేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసిరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ డిఎం శివరాంప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ ప్రశాంతి

సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

స్పందన కార్యక్రమం ద్వారా వచ్చే వినతులను సమర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రశాంతి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 184 వినతులను స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించే విధంగా ఆదేశాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు అర్జీదారులకు పూర్తి న్యాయం చేయాలన్నారు. అర్జీ దారుని వైపు నుంచి సమస్యను ఆలోచిస్తే కచ్చితంగా పరిష్కరించగలమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసి రాజు, డిఎస్‌పి బి.శ్రీకాంత్, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అధ్వానంగా పెనుగొండ మార్కెట్

క్షీణించిన పారిశుధ్యం

కొనుగోలుదారులకు తప్పని అవస్థలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ మార్కెట్ అధ్వానంగా తయారైంది. పారిశుధ్యం క్షీణించి అస్తవ్యస్తంతా మారింది. రద్దీగా ఉండే ఈ మార్కెట్‌లో చిరువ్యాపారులు, రైతులు, పలువ్యాపారులు షాపులను ఏర్పాటు చేసి పెద్దఎత్తు విక్రయాలు సాగిస్తుంటారు. కూరగాయలు, మాంసం, చేపల దుకాణాలు కిటకిటలాడుతుంటాయి. మున్సిపాలిటీ స్థాయిలో ఉన్న ఈ పంచాయతీ మార్కెట్ ప్రతీ బుధవారం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున వస్తుంటారు. అన్ని రకాల కూరగాయలు, పండ్లు, వస్తువులు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. అయితే ఇక్కడి పారిశుధ్య పరిస్థితులకు జనం బెంబేలెత్తుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం, ఈగలు, దోమలు, కుక్కలు, పందుల బెడదతో కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. చేపలు, కోళ్ల, కూరగాయల వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేయడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. వ్యర్థాల దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్‌లోకి అడుగుపెట్టాలంటేనే కొనుగోలుదారులు వణికిపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న మార్కెట్ పరిసరాలు



ప్రజలకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలను వినియోగించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. సోమవారం స్థానిక మూడో వార్డు కళాభవన్ వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి నుండి కాకుండా బ్రిడ్జి పైనుండి పట్టాలు దాటుకుంటూ వెళ్తున్న వారిని గమనించి వారితో మాట్లాడారు. అండర్ పాస్ బ్రిడ్జిని మాత్రమే వినియోగించాలని, ప్రమాదకర పరిస్థితుల్లో రైలు పట్టాలను దాటుకుని వెళ్లొద్దని హితువు పలికారు. అండర్ పాస్ బ్రిడ్జి వినియోగంలో ఉన్నందున ఆ ప్రదేశంలో రైలు వేగం కూడా ఎక్కువగా ఉంటుందన్నారు, సమయం ఆదా అవుతుందనే ఆలోచన మానుకుని తొందరపాటుగా రైలు పట్టాలను దాటుకుని వెళ్లి ప్రమాదాలను కోరి తెచ్చుకోవద్దని సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, తహశీల్దార్ సిహెచ్.రవికుమార్ ఉన్నారు

కల్లుపాక తొలగిస్తే ఊరుకోబోం

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - ఆచంట

గత 40 సంవత్సరాల నుంచి ఐదుగురు ఆడపిల్లలతో కల్లు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న బొంతు పెద్దిరాజు, మార్తమ్మ కల్లు పాక తొలగిస్తే చూస్తూ ఊరుకోబోమని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి హెచ్చరించారు. సోమవారం ఆచంట వేమవరం గ్రామ శివారులోని కల్లుపాక చుట్టు పక్కల పరిశీలించి చుట్టూ ఉన్న రైతులు, గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కల్లుపాక చుట్టూ ఉన్న రైతులకు గాని, పొలాలకు వెళ్లేవారికి గాని, ఆర్‌అండ్‌బి రహదారికి 20 అడుగుల దూరంలో ఎవరికీ అభ్యంతరం లేదని తెలిపారు. కేవలం వ్యక్తిగత కక్షతో ఆక్వాచెరువు యజమానురాలు కట్టా సత్యవతి పెట్టిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారని, రెవెన్యూ అధికారులు పున్ణపరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. పేద గీత కార్మికుడు బొంతు పెద్దిరాజుపై కక్ష సాధింపు చర్యలు సరికాదన్నారు. సంబంధిత అధికారులు ఒక్కసారి ఆ కల్లుపాకను పరిశీలించి, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మికులను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతి చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ నజీముల్లా సాకుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ కట్టా సత్యవతి స్పందనలో ఫిర్యాదు చేశారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు రోజుల్లో ఆ పాకను తొలగించాలని, ఆ పాక ఆర్‌అండ్‌బి స్థలంలో ఉందని ఆయన వివరణ ఇచ్చారు.




తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహమూర్తి

మెరుగైన వైద్య సేవలందించాలి

గూడెంలో బత్తిన ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక జూబ్లీ రోడ్డులో నూతనంగా స్థాపించిన బత్తిన హాస్పిటల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల ఆసుపత్రులు మల్టీస్పెషాల్టీ సేవలతో, ఆధునిక సాంకేతిక సౌకర్యాలతో ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించి వారి మన్ననలు పొందాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు. చిన్న వయసులోనే ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆసుపత్రి ప్రారంభించడం పట్ల ఆసుపత్రి యజమాని బత్తిన గణేష్‌ను అభినందించారు. బత్తిన గణేష్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద తాడేపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ పరిమి తులసీదాస్, రామన్నగూడెం సర్పంచి చింతా వెంకట్రావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



హాస్పటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజారోగ్యానికి పెద్దపీట : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజారోగ్యానికి పెద్ద పీట వేశారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ దాదాపుగా మూడు వేలకు పైగానే వ్యాధులకు ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యాన్ని అందిస్తున్న ఘనత జగన్‌కే దక్కిందన్నారు. అంతేకాకుండా వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గ్రామాల్లో, పట్టణాల్లో వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, కొల్లి ప్రసాద్, పోలిశెట్టి దాసు, బొక్కు గోపి, మల్లుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతకు సైన్స్ ప్రదర్శనలు దోహదం

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యార్థుల సృజనాత్మకతను బయటకు తీసేందుకు సైన్స్ ప్రదర్శనలు ఉపయోగపడతాయని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. సోమవారం మొగల్తూరు లోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌విఆర్ మూర్తిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైన్స్ ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా మూర్తిరాజు మాట్లాడారు. మండలంలోని 13 పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి బోణం నరసింహారావు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న సర్పంచి గూడూరు దేవేంద్రుడు

బిసి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామంలో బిసి కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు మామిడూరు సర్పంచి గూడూరి దేవేంద్రుడు తెలిపారు. గ్రామంలో జెడ్‌పి నిధులు రూ.10 లక్షలతో బిసి కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు సర్పంచి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవేంద్రుడు మాట్లాడుతూ ఈ భవన నిర్మాణానికి జెడ్‌పి నిధులతో పాటు ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహాయం అందిస్తున్నట్లు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వాసంశెట్టి కిరణ్, సొసైటీ అధ్యక్షుడు దాట్ల గోపాలకృష్ణంరాజు (చంటిరాజు), వైసిపి గ్రామ అధ్యక్షుడు భోగిరెడ్డి మురళి, మాజీ జెడ్‌పిటిసి వీరవల్లి తాతాజీ, మాజీ ఎంపిటిసి కుక్కల ప్రభ పాల్గొన్నారు.

కొనసాగిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి గ్రామంలోనూ 29 శాఖలు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి జరుగుతుందని ఇఒపిఆర్‌డి రాంప్రసాద్ అన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద రెండో రోజు గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, వెటర్నరీ, హెల్త్, డ్వాక్రా యానిమేటర్స్, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే గ్రామంలోని వనరులన్నింటినీ సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. వివిధ శాఖల ద్వారా వస్తున్న నిధులను కూడా ప్రణాళిక బద్ధంగా వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌ఇజిఎస్ టి.వి.బాపూజీ, టిఒటిలు రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం రాసులు పరిశీలన

ప్రజాశక్తి - పెనుమంట్ర

తుపాన్ నేపథ్యంలో రైతులు కోతలు కోయొద్దని ఎఒ మద్దాల జయ దుర్గామాధురి అన్నారు. సోమవారం గరువులో పర్యటించిన ఎఒ దుర్గామాధురి వెలగల ధర్మారెడ్డి రోడ్డు పక్కన ఆరబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు ఆమె వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి ధాన్యం తడిసిపోయిందని తెలిపారు. దీంతో ఎఒ రైతు వద్ద తడిసి మొలకెత్తిన ధాన్యం సేకరించారు. 25 తేమ శాతాన్ని 17 తేమ శాతంగా మార్పు చేసి కొనుగోలుచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. తుపాన్ ప్రభావం ఇంకా ఉందని, రైతులు కోతలు కోయొద్దని, నూర్పిడి నిలిపివేసుకోవాలని రైతులకు సూచించారు. వాతావరణాన్ని బట్టి జాగ్రత్తలు తీసుకోవాలి తప్ప, ఇబ్బందులు పడొద్దని సూచించారు. రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని భద్రపరుచుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారంలో జగన్ విఫలం

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో సిఎం జగన్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంఎల్‌సి షరీఫ్, నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. సోమవారం మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో పేరుపాలెంలో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలు అందించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, సత్తినేని సర్వేశ్వరరావు, కొల్లాటి భోగరాజు, డోల్ల రత్నం రాజు పాల్గొన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి

వైసిపి ప్రభుత్వంలో రైతులకు అవస్థలు

ఎంఎల్‌ఎ నిమ్మల, ఎంఎల్‌సి అంగర

పాలకొల్లు రూరల్:లంకలకోడేరులో శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌ఎ అంగర రామ్మోహన్‌రావు సోమవారం పర్యటించారు. తుపాను కారణంగా తడిసిపోయిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామానాయుడు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక జగన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తేమ శాతం పేరుజెప్పి రైతులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. పంటను అమ్ముకోవాలంటే వాలంటీర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రావు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు కానీ భారతి సిమెంట్ మాత్రం తనకు నచ్చిన రేటుకు అమ్ముకుంటున్నారని విమర్శించారు. రకరకాల నిబంధనలతో రైతులను వేధించడం మానుకోవాలన్నారు. వారి వెంట పార్టీ రాష్ట్ర రైతు కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, పాతూరి రామ ప్రసాద్ చౌదరి ఉన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకురూరల్



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, వైద్యం అందించే విషయంలో డాక్టర్లు ఆలసత్వం వహించొద్దని ఆసుపత్రి అభివృద్ధి, సలహాల సంఘం ఛైర్మన్, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. తొలుత ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మించిన ప్రత్యేక నవజాత శిశు వైద్యశాల (ఎస్ఎన్‌సియు) విభాగాన్ని ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ రోగుల ఆరోగ్యం గురించి వైద్యులు పూర్తి పర్యవేక్షణ ఉండాలన్నారు. గర్భిణులు, పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డాక్టర్లు ఆసుపత్రిలో సమయానికి అందుబాటులో ఉండాలన్నారు. 100 పడకల ఉన్న ఆసుపత్రి ఇప్పుడు 150 పడకల ఆసుపత్రిగా మారిందన్నారు. అందుకనుగుణంగా ప్రజల వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా వైద్య శాఖ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడి జనవరి నెలలో పూర్తి స్థాయిలో అదనపు సిబ్బంది నియామకం పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆసుపత్రిలో పారిశుధ్యం నిర్వహణ బాగానే ఉందని, మరింత మెరుగుపర్చే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.శివప్రసాద్, మాజీ ఎఎంసి ఛైర్మెన్ చిట్టూరి సుబ్బారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దాట్ల సుందర రామరాజు, ఉండవల్లి జానకి, వి.అరుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థవంతంగా రీ సర్వే చేయాలి

తహశీల్దార్ షేక్ హుస్సేన్



మాట్లాడుతున్న తహశీల్దార్ షేక్ హుస్సేన్

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేను మండలంలో సమర్థవంతంగా చేయాలని తహశీల్దార్ షేక్ హుస్సేన్ సూచించారు. పెన్నాడ, గొరగనమూడి, విస్సాకోడేరు, వేండ్ర, వేండ్ర అగ్రహారం, కొండేపూడి, మోగల్లు, పాలకోడేరు, కుముదవల్లి, గొల్లలకోడేరు, గరగపర్రు, కోరుకొల్లు, మైప గ్రామాల్లో రీ సర్వేపై సోమవారం ఆయా సచివాలయ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ షేక్ హుస్సేన్, డిప్యూటీ తహశీల్దార్ శివ కృష్ణ, ఆర్‌ఐ నాగభూషణరావు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు, మండల సర్వేయర్ శ్రీనివాస్ సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రీసర్వేపై వివిధ అంశాలలో వారికి వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. మండలంలోని మూడు బృందాలుగా రీసర్వే అధికారులను నియమించి గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రీసర్వే పట్ల నిర్లక్ష్యం వహించకుండా అధికారులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. రీ సర్వే చేసేటప్పుడు వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిల్లా అనూష సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, విఆర్‌ఒలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొడమంచిలి గ్రామాభివృద్ధికి కృషి

ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి గ్రామాభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు స్పష్టం చేశారు. సోమవారం కొడమంచిలిలో రెండో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పాల్గొని ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించామని, ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకోవాలని కోరారు. ప్రతి గడపకూ వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో అగ్రవర్ణ నిరుపేదలకు ఇబిసి పథకం ద్వారా ఇప్పటివరకు రూ 94.5 లక్షల వరకూ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, ఎంపిటిసి యల్లమెల్లి బేబీ రాజేష్, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతుల కష్టాలు తీరేవరకూ ఉద్యమిస్తాం


బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు

భీమవరం రూరల్ :రాష్ట్రంలో రైతుల కష్టాల తీరేవరకు రోడ్లెక్కి ఉద్యమాలు చేస్తూనే ఉంటామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ప్రకటించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం పట్టాదారు పాసు పుస్తకాలపై ముద్రిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫొటోను తొలగించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కేంద్ర విడుదల చేసిన ఎన్ఆర్‌ఇజిఎస్ నిధులతో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలను నిర్మిస్తోందన్నారు. దేశంలో రైతుల వినియోగిస్తున్న ఎరువులపై సబ్సిడీ ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ధాన్యం సొమ్మును వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అల్లూరి సాయి దుర్గరాజు, నేతలు పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులుగా చిన వీరభద్రరావు



తణుకురూరల్:ఇటీవల జంగారెడ్డిగూడెంలో జరిగిన ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులుగా బళ్ల చిన వీరభద్రరావు తిరిగి ఎన్నికైనట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర 29వ మహాసభలో పశ్చిమగోదావరి జిల్లా నుండి తనతో పాటు రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులుగా జక్కంశెట్టి సత్యనారాయణ, బాతిరెడ్డి జార్జి, కండెల్లి సోమరాజును తిరిగి ఎన్నుకున్నట్లు వీరభద్రరావు తెలిపారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మహాసభలో ప్రజలు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కోంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమాలు రూపొందించినట్లు తెలిపారు. వ్యవసాయ రంగం, ఉపాధి పరిరక్షణ, భూమి పంచాలి, కూలీ పెంచాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు.



పడగొట్టిన దుకాణాలను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

బాధితులకు టిడిపి అండ

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెంబీచ్ ఉపాధి పోగొట్టుకున్న బాధితులకు టిడిపి అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో పేరుపాలెం బీచ్‌లో నాయకులు పర్యటించి బాధ్యత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు దుండి రాకేష్ మాట్లాడారు. పేరుపాలెం బీచ్ వద్ద ఉపాధి పొందుతున్న బాధితుల దుకాణాలను కక్షపూరితంగా తొలగించారన్నారు. దుకాణాలు తొలగించడానికి పెట్టిన ఖర్చు అభివృద్ధిపై పెడితే బీచ్ అభివృద్ధి చెందుతుందన్నారు. బాధితులు తమ గోడు వినిపించడానికి ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాద్‌రాజుకు ఫోన్‌చేస్తే స్పందించకపోవడం దారుణమన్నారు. మాజీ ఎంఎల్‌సి ఎంఎ షరీఫ్ మాట్లాడుతూ సిఆర్‌జెడ్ భూముల్లో ఉపాధి పొందుతున్న పేదల దుకాణాలు తొలగించి ఆ భూములను బడాబాబులకు పట్టం కట్టడానికి వైసిపి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ ప్రజా వేదిక కూల్చడంతో మొదలుపెట్టిన వైసిపి ప్రభుత్వం చిరు వ్యాపారుల ఉపాధి కొల్లగొట్టిన ఘనత ఆ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, ఎంపిటిసి సభ్యులు అందే దొరబాబు, పాల రాంబాబు, బల్ల శ్రీను, డోల్లా రత్నంరాజు, దంపనబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

బీచ్‌లో దుకాణాల తొలగింపు ఆపాలి

స్పందనలో సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి - నరసాపురం



స్పందనలో సబ్‌కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న సిపిఎం నేతలు

పేరుపాలెం బీచ్ వద్ద చిరు వ్యాపారుల దుకాణాల తొలగింపు ఆపాలని, సిఆర్‌జెడ్ భూములు ధనిక రైతుల నుంచి స్థానిక పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పేరుపాలెం బీచ్‌లో చిరు వ్యాపారుల సమస్యలు, సిఆర్‌జెడ్ భూములు పేదలకు ఇవ్వాలని విషయంపై సబ్ కలెక్టర్ సూర్య తేజకు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కవురు పెద్దిరాజు మాట్లాడుతూ చిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని బీచ్‌లో కల్పించాలన్నారు నర్సాపురం, మొగల్తూరు మండలాల్లో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉందని, దీనికి ఆనుకొని సిఆర్‌జెడ్‌లో వందలాది ఎకరాల సారవంతమైన భూమి ధనిక రైతుల స్వాధీనంలో ఉందని దాన్ని స్థానిక మత్స్యకారులు, చిన్న, సన్నకారు రైతులకు, పేదలకు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన హంస రిసార్ట్స్‌ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. సబ్ కలెక్టర్ సూర్య తేజ మాట్లాడుతూ శాశ్వత కట్టడాలు లేకుండా పేరుపాలెం బీచ్‌లో చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకోవచ్చని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు చేపట్టకూడదని తెలిపారు. ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల నాయకులు జల్లి రామ్మోహనరావు, కొల్లాటి బాబూరావు, కొత్తపల్లి నాగరాజు మువ్వల రాజారావు, ఎం.శివరాజు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

క్యాంపస్ ఇంటర్వ్యూలకు 11 మంది విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 17 మంది విద్యార్థులు హెటిరో ఫార్మా లాబ్స్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థుల్లో 11 మంది ఛాంబర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, 10 మంది వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.1.8 లక్షలు జీతంగా చెల్లిస్తారని ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూలను హెటిరో ఫార్మా ల్యాబ్స్ తరపున ఎస్.వంశీ బృందం నిర్వహించగా, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణ్‌రావు సంధానకర్తగా వ్యవహరించారు. కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు, అడిషనల్ ఛైర్మన్ తటవర్తి కృష్ణమూర్తి, సెక్రటరీ కలిదిండి రామరాజు, విద్యార్థులను అభినందించారు.

హాకీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హాకీ, ఫెన్సింగ్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 14 పాఠశాలల నుంచి క్రీడాకారులు వచ్చినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బి.జాన్సన్ తెలిపారు. 14, 17 సంవత్సరాల విభాగంలో హాకీ బాలికలు, బాలుర జట్టుకు 72 మంది, ఫెన్సింగ్ జట్టుకు 24 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శృంగవృక్షం జెడ్‌పి ఉన్నత పాఠశాల నుంచి 14 సంవత్సరాల విభాగానికి 10 మంది, 17 సంవత్సరాల విభాగానికి 12 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎండీ, కుద్దూస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి సురేంద్రబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట కాశీజగన్నాధరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పిఎస్ఎన్. మల్లేశ్వరరావు, బాజింకి శ్రీనివాసరావు, కె.చిట్టిబాబు, జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

నత్తారామేశ్వరం సర్పంచికి గాయాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రోడ్డు ప్రమాదంలో నత్తా రామేశ్వరం సర్పంచి వెలగల ధర్మారెడ్డి తీవ్రగా గాయపడిన సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఆయన ఇంటి నుంచి ఉదయం బయల్దేరి పెనుమంట్ర వైపు తన పొలానికి వెళ్తుండగా ఎదురుగా బైక్ రావడంతో ఒక్కసారిగా బ్రేక్ వేశారు. దీంతో బండిపై నుంచి కింద పడిపోయాడు. ఆయనను స్థానికులు తణుకు ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కుడిచేయి ఫ్రాక్చర్ అయ్యింది.

లజపతిరాయ్‌పేట రోడ్డు అధ్వానం

వాహనదారులు, ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - పాలకొల్లు



అధ్వానంగా ఉన్న రోడ్డు

స్థానిక లజపతిరాయ్ పేట, ఎఫ్‌సిఐ గొడౌన్స్ రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ఆయా ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనికితోడు పారిశుధ్యం అధ్వానంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. పలు మార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టి పారిశుధ్య పరిస్థితిని మెరుగు పర్చాలని వైసిపి నేత నీలం శెట్టి సత్య ప్రసాద్ డిమాండ్ చేశారు.

ధాన్యం అమ్మిన వెంటనే సొమ్ము జమచేయాలి

కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతుల వద్ద 45 కేజీల ధాన్యం తూయడం వల్ల లాభదాయకంగా ఉంటుందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు డిమాండ్ చేశారు. సోమవారం పెనుమంట్ర పరిధిలో కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో రైతుల వద్ద ధాన్యం బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడారు. వాస్తవ సాగుదారులు ఇకెవైసి చేయించుకోకపోవడం వల్ల ధాన్యం డబ్బులు సొంత రైతుల ఖాతాల్లోకి వెళ్లిపోయే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బి.విజయ్‌కుమార్, రైతులు గునుపూడి శ్రీను, బాలం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ సత్యనారాయణ మరిన్ని డాక్టరేట్లు పొందాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆక్వా రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశోధనలు చేసి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన సిఎస్ఎన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ సుకుమళ సత్యనారాయణ భవిష్యత్తులో మరిన్ని డాక్టరేట్లు అందుకోవాలని ఎంఎల్‌ఎ గ్రంది .శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయనను ఎంఎల్‌ఎ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆక్వా రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి పరిశోధనలు చేసిన ప్రిన్సిపల్ శకుమళ సత్యనారాయణ సూచనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకునే విధంగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలేజీ ఛైర్మన్ చీడే సత్యనారాయణ, పోలిశెట్టి దాసు, గెడ్డం భాస్కరరావు పాల్గొన్నారు.

కరాటేలో పాలకొల్లు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

అమలాపురంలో జరిగిన 3వ స్టేట్ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్-22 పోటీల్లో పాలకొల్లుకు చెందిన ధనాని సూర్యప్రకాష్ బృందం కరాటే విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కటా విభాగంలో 11 మంది పాల్గొనగా ఐదుగురు ప్రథమ స్థానం, ముగ్గురు ద్వితీయ స్థానం, ముగ్గురు తృతీయ స్థానం సాధించారు. కుమితే విభాగంలో 11 మంది పాల్గొనగా ఆరుగురు ప్రథమస్థానం, ముగ్గురు ద్వితీయ స్థానం, ఇరువురు తృతీయ స్థానం సాధించారు. వారిని పాలకొల్లు జపాన్ షోటోకాన్ కరాటే డూ - కనంజూకు ఆర్గనైజేషన్ ఇన్‌స్ట్రక్టర్స్ లక్ష్మీనారాయణ, అప్పలస్వామి అభినందించారు.